నూతన సంవత్సరం వేళ .. ట్యాంక్ బండ్‌పై యువత కేరింత

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, గురువారం 2 జనవరి 2025 | HYDERABAD

ఫలించిన పోరాటం

దిగొచ్చిన సర్కారు.. నార్త్ సిటీ మెట్రోకు ఓకే

ప్యారడైజ్ నుంచి మేడ్చల్, జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు మెట్రో మార్గం

ఫేస్-2 బీ డీపీఆర్ సిద్ధం చేయాలని ప్రభుత్వం ఆదేశం

సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ) : నార్త్ సిటీ మెట్రో నిర్మాణానికి ఇన్నాళ్లు సాగిన ప్రజా పోరాటానికి ఫలితం వచ్చింది. ఎట్టకేలకు ఫేస్-2లోనే నార్త్ సిటీ మెట్రో నిర్మిస్తామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఇప్పటికే రూపొందించిన డీపీఆర్‌కు అనుబంధ డీపీఆర్‌ను సిద్ధం చేయాలంటూ హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్‌ను సీఎం ఆదేశించారు. నార్త్ సిటీలోని పలు ప్రాంతాల నుంచి నిత్యం నగరానికి వచ్చిపోయే వారి సంఖ్య లక్షల్లో ఉంటుంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాంతాలు లేకుండా ఫేస్-2 కింద ప్రాజెక్టు చేపట్టేందుకు డీపీఆర్ సిద్ధం చేసింది. ఈ క్రమంలో ఏడాది కాలంగా తమ ప్రాంతానికి మెట్రో నిర్మాణం చేయాల్సిందేనంటూ నార్త్ సిటీ వాసులు ఆందోళనలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులను కలిసి విన్నవించారు. ఇంటింటికీ మెట్రో సాధన పేరిట మేడ్చల్ మేట్రో సాధన సమితి ఆధ్వర్యంలో తమ ప్రాంతానికి మెట్రో ప్రాధాన్యతను వివరిస్తూ అవగాహన కల్పించారు. దీంతో ప్రభుత్వం ప్రజా ఆకాంక్షలను గుర్తించి మెట్రో నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. మెట్రో ఫేస్-2బీ డీపీఆర్‌ను మూడు నెలల్లో డీపీఆర్ సిద్ధం చేస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి స్పష్టం చేశారు.

ప్రజా పోరాటాలకు..

ప్రజా పోరాటాలకు ప్రభుత్వం మరోసారి తలొగ్గింది. కాగితాలకే పరిమితమైన ఫోర్త్ సిటీకి మెట్రో నిర్మిస్తామంటూ ప్రభుత్వం చేసిన ప్రకటనతో... నార్త్ సిటీ వాసులు ఆందోళన చెందారు. నిత్యం లక్షలాది మంది ప్రయాణిస్తూ, 30లక్షలకు పైగా జనాభా కలిగిన ప్రాంతాలకు మెట్రో విస్తరించకుండా... జనసంచారమే లేని ప్రాంతాలకు మెట్రో లైన్ వేయడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ..... పార్టీలకు అతీతంగా చేసిన ప్రజా పోరాటాన్ని ప్రభుత్వం అంగీకరించింది. ముఖ్యంగా మేడ్చల్ మెట్రో సాధన సమితి ఆధ్వర్యంలో చేసిన ఉద్యమానికి అనుగుణంగా... ఈ ప్రాంతానికి మెట్రో విస్తరించే ప్రణాళికలు రూపొందించింది.

నార్త్ సిటీ మెట్రో సాధన ఉద్యమంలో 'నమస్తే తెలంగాణ'..

నార్త్ సిటీకి మెట్రోను విస్తరించాలని ప్రజా ఆకాంక్షలుగా అనుగుణంగా ప్రజా ఉద్యమంలో 'నమస్తే తెలంగాణ' కూడా తన వంతు పాత్రను పోషించింది. ఈ క్రమంలో గతేడాది మార్చి నెల్లో సీఎం రేవంత్‌రెడ్డి ఎలివేటెడ్ కారిడార్ శంకుస్థాపన సమయంలోనే మెట్రో నిర్మాణంపై ఎలాంటి స్పష్టతనివ్వకపోవడంతో..'ఎలివేటెడ్ కారిడార్‌లో మెట్రో గల్లంతు', మెట్రో లేని ఉత్తర నగరం, నార్త్ సిటీకి ప్రాధాన్యత ఇవ్వకుండానే ఫేస్-2 డీపీఆర్ రూపకల్పన జరుగుతున్న సమయంలో 'నార్త్ సిటీకి మెట్రో లేనట్టేనా?' 'నార్త్ సిటీ అభివృద్ధికి బీఆర్ఎస్ కృషి' మెట్రో సాధన కోసం మేడ్చల్ మెట్రో సాధన సమితి కార్యక్రమాలు, డబుల్ డెక్కర్ లేకుండానే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం చేయాలంటూ ప్రభుత్వం చేసిన సూచనలను ఎండగడుతూ.. మెట్రో సాధన కోసం వరుసగా కథనాలను 'నమస్తే' ప్రచురించింది.

మెట్రో సాధనలో కీలకంగా..

నార్త్ సిటీ మెట్రో సాధనలో మేడ్చల్ మెట్రో సాధన సమితి, బీఆర్ఎస్ కీలకంగా వ్యవహరించింది. గేట్ వే ఆఫ్ నార్త్ తెలంగాణగా పిలిచే ప్రాంతాలను పారిశ్రామిక కేంద్రాలుగా తీర్చిదిద్దేలా ఐటీ పార్కులు, ఇండస్ట్రీయల్ కారిడార్లతోపాటు, మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేలా మాజీ సీఎం కేసీఆర్ ప్రణాళికలు రూపొందించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలో ఐటీ పార్క్ డెవలప్‌మెంట్‌కు ప్రణాళికలను అమలు చేసింది. అదే విధంగా ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణానికి, బల్దియాలో కంటోన్మెంట్ విలీనంపై ప్రత్యేక దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపింది. రక్షణ శాఖ భూములను రాష్ట్రానికి కేటాయించాలని ప్రతిపాదించింది. పెండింగ్‌లో ఉన్న కేటాయింపుల ప్రక్రియ ముందుకు కదలడంతో... నార్త్ సిటీలో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి ఏడాది కిందట కాంగ్రెస్ సర్కారు శంకుస్థాపన చేసింది. తాను ఎంపీగా గెలిచిన తర్వాత మల్కాజిగిరి ప్రజలకు రుణపడి ఉంటానని, ఈ ప్రాంత అభివృద్ధికి కట్టుబడి ఉన్నానంటూ సీఎం రేవంత్‌రెడ్డి అనేక సార్లు ప్రకటించారు. కానీ ఇటీవల ఫేజ్-2 విస్తరణ ప్రణాళికల్లో ఆ ప్రాంతాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో పెద్ద ఎత్తున ఆందోళనలు వ్యక్తమయ్యాయి. కానీ ఎట్టకేలకు ఆ ప్రాంత వాసుల డిమాండ్‌ను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం.. నార్త్ సిటీ మెట్రోకు సానుకూలంగా స్పందించడంతో ఆ ప్రాంత వాసుల కోరిక నెరవేరింది.

ఫేస్-2బీగా నిర్మాణం...

ప్యారడైజ్ నుంచి మేడ్చల్(23 కిలోమీటర్లు), జేబీఎస్ నుంచి శామీర్‌పేట (22 కి.మీలు) మేర మెట్రో కారిడార్‌ను ఫేస్-2లోనే నిర్మించనున్నారు. పార్ట్-బీగా వచ్చే ఈ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్ సిద్ధం చేసిన ప్రభుత్వానికి అందజేయాలని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్‌వీఎస్ రెడ్డిని ఆదేశించారు. స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ సూచనలు, సలహాలు కూడా తీసుకోవాల్సిందిగా మెట్రో ఎండీని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ట్రాఫిక్ సమస్యలను తొలగించేలా ప్రాజెక్టు చేపట్టాలని, అందుకు అవసరమైన ప్రణాళికలు రూపకల్పన చేయాలని సర్కారు ఆదేశించింది. అయితే నార్త్ సిటీ మెట్రో నిర్మాణం కూడా ఫోర్త్ సిటీ మెట్రో అలైన్‌మెంట్‌తో కలిపి నిర్మించనున్నారు. ప్రస్తుతం ఒక కిలోమీటర్‌కు రూ. 318 కోట్ల అంచనా వ్యయంతో ప్రాజెక్టు చేపట్ట నుండగా, ప్రస్తుతం 45 కిలోమీటర్ల ప్రాజెక్టుకు అదనంగా మరో 14310 వేల కోట్లు అయ్యే అవకాశం ఉందనే అంచనాలున్నాయి.

మెట్రో మార్గమిదే..

ప్యారడైజ్ నుంచి మెట్రో స్టేషన్ నుంచి తాడ్‌బండ్, బోయినపల్లి, సుచిత్ర సర్కిల్, కొంపల్లి, గుండ్లపోచంపల్లి, కండ్లకోయ, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా మేడ్చల్ వరకు దాదాపు 23 కిలోమీటర్ల కారిడార్ ఉంటుంది. అదేవిధంగా జేబీఎస్ మెట్రో స్టేషన్ నుంచి విక్రంపురి, కార్ఖానా, తిరుమలగిరి, లోతుకుంట, అల్వాల్, బొల్లారం, హకీంపేట, తూంకుంట, ఓఆర్ఆర్ ఎగ్జిట్ మీదుగా శామీర్‌పేట వరకు 22 కిలోమీటర్ల మేర రూట్ మ్యాప్ ఉండాలని అందుకు అవసరమైన డీపీఆర్ సిద్ధం చేయాలని మెట్రో ఎండీని ఆదేశించారు.

గేదల కుంటను కాపాడండి

అధికార పార్టీ నేతలు కబ్జా చేస్తున్నారు

బాబా జగ్జీవన్ రాం యువజన సంఘం నేతలు

బడంగ్ పేట, జనవరి 1: బాలాపూర్‌లో ఉన్న చెరువులు, కుంటలను అధికార పార్టీకి చెందిన నాయకులు కబ్జా చేస్తున్నారని బాబు జగ్జీవన్ రామ్ యువజన సంఘం అధ్యక్షుడు గడ్డం వెంకటేశ్, తిమ్మని గిరీశ్, నీరుడు శ్రీరాములు, పగడాల ఉమేశ్, సుధాకర్ ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ పరిధిలో ఉన్న పురాతన గేదల కుంట కట్టను తొలగించి చెరువు ఆనవాళ్లు లేకుండా చుట్టు ప్రహరీ ఏర్పాటు చేశారని, చెరువును మట్టితో పూడ్చివేస్తున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకుల కబ్జాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందన్నారు. బాలాపూర్ రెవెన్యూ అధికారులకు, ఇరిగేషన్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బాలాపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ .74లో ఉన్న ప్రభుత్వ భూమిని అనుసరించి గేదల కుంట ఉందన్నారు. సర్వే నంబర్. 74లో ఉన్న ప్రభుత్వ భూమిని అధికారులు సర్వే చేసిన తర్వాత మూడు ఎకరాల భూమి ఉన్నదని నిర్ధారించారన్నారు. ప్రభుత్వ భూమి, చెరువులు, కుంటలను ఆక్రమించి నిర్మాణాలు చేపడుతుంటే రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వెళ్లే ఆర్‌సీఐ ప్రధాన రహదారిని అనుసరించి గేదల కుంట ఉందన్నారు. రోడ్డు సైడ్ కనిపిస్తుందన్న ఉద్దేశంతో రాత్రికి రాత్రి ప్రహరీ ఏర్పాటు చేశారని, తప్పుడు పత్రాలు సృష్టించారని తెలిపారు. ప్రహరీతో పాటు గేట్లు ఏర్పాటు చేశారన్నారు. అధికార పార్టీ అండతో దర్జాగా కబ్జాలు చేస్తున్నారని వారు ఆరోపించారు. అధికారులు అధికార పార్టీ నాయకులకు భయపడి చర్యలు తీసుకోవడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. గేదల కుంటను కాపాడే వరకు పోరాటం చేస్తామన్నారు.

టార్గెట్ వ్యాపారులు!

ట్రేడ్ లైసెన్స్‌లు లేని వారిపై స్పెషల్ ఫోకస్

ఆస్తిపన్ను జాబితా ఆధారంగా రంగంలోకి దిగిన అధికారులు

ట్రేడ్ లైసెన్స్ వసూళ్లను పెంచుకోవడమే లక్ష్యంగా చర్యలు

సిటీబ్యూరో:గ్రేటర్‌లో వాణిజ్య సంస్థలు, వ్యాపారస్తులపై జీహెచ్ఎంసీ ఫోకస్ చేసింది. ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిని టార్గెట్ చేసింది. ప్రాపర్టీ ట్యాక్స్ డేటాబేస్ ఆధారంగా 317033 మంది కమర్షియల్ కేటగిరీలో ఆస్తిపన్ను చెల్లిస్తుండగా, వీరంతా ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాలోకి రావాల్సి ఉంది. కానీ కేవలం లక్షా 9వేల 702 మంది మాత్రమే ట్రేడ్ లైసెన్స్ ఫీజులు చెల్లిస్తున్నట్లు అధికారులు తేల్చారు. 30 సర్కిళ్లలో ట్రేడ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి వారి నుంచి ఫీజులు వసూలు చేసేలా తాజా కార్యాచరణను సిద్ధం చేశారు. డిప్యూటీ కమిషనర్లు, ఏఎంఓహెచ్, లైసెన్స్ ఆఫీసర్స్, అసిస్టెంట్ లైసెన్స్ ఆఫీసర్స్, చీఫ్ వెటర్నరీ ఆఫీసర్స్‌లకు తనిఖీలు నిర్వహించి ట్రేడ్ లైసెన్స్‌ల జాబితాలోకి చేర్చాలని కమిషనర్ ఇలంబర్తి ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. సంస్థ ఆదాయాన్ని పెంచుకునే దిశలోనే వ్యాపారస్తులపై స్పెషల్ డ్రైవ్‌లు చేపడుతుండడం గమనార్హం.

సర్కిళ్ల వారీగా తనిఖీలు

30 సర్కిళ్లలో నాన్ రెసిడెన్షియల్ పీటీఐఎన్‌లు (ఇంటి నంబర్లు)ను గుర్తించారు. రెండు లక్షల 49వేల 522 వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ జాబితాలో లేరని ఆస్తిపన్ను చెల్లింపుల ద్వారా నిర్ధారించారు. కమర్షియల్ కేటగిరీలో ఆస్తిపన్ను చెల్లిస్తుండగా, వీరంతా ట్రేడ్ లైసెన్స్ జాబితాలో లేరని తేల్చారు. ఈ మేరకు సర్కిళ్ల వారీగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి సమగ్ర నివేదిక ఇవ్వాలని సంబంధిత డీసీ, ఏఎంఓహెచ్, సిబ్బందికి కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. సర్కిళ్లగా జాబితా ప్రకారం.. తనిఖీలు చేస్తున్న అధికారులు త్వరలో నివేదిక ఇవ్వనున్నారు. అత్యధికంగా గోషామహల్ 34137 వ్యాపారస్తులు ఉండగా, బేగంపేట 20324, శేరిలింగంపల్లి 17055, చార్మినార్‌లో 15313, ఖైరతాబాద్ 14745 వ్యాపారస్తులు ఉన్నట్లు అధికారులు అంచనా వేశారు. వీటితో పాటు మిగతా సర్కిళ్లను పరిశీలిస్తే కాప్రాలో 7853, ఉప్పల్ 5483, హయత్‌నగర్ 6773, ఎల్బీనగర్ 6094, సరూర్‌నగర్ 6893, మలక్‌పేట 6572, సంతోష్‌నగర్ 3022, చాంద్రాయణగుట్ట 2451, ఫలక్‌నుమా 5171, రాజేంద్రనగర్ 5477, మెహిదీపట్నం 8492, కార్వాన్ 4625, గోషామహల్ 34137, ముషీరాబాద్ 6675, అంబర్‌పేట 9750, జూబ్లీహిల్స్ 9815, యూసుఫ్‌గూడ 3209, చందానగర్ 7437, ఆర్‌సీ పురం, రామచంద్రాపురం 2390, మూసాపేటలో 7948, కూకట్‌పల్లిలో 7349, కుత్బుల్లాపూర్‌లో 6653, గాజుల రామారం 4591, అల్వాల్ 4903, మల్కాజిగిరి 5549, సికింద్రాబాద్‌లో 2773ల వ్యాపారస్తులపై సర్వే చేసి కమిషనర్‌కు నివేదిక ఇవ్వనున్నారు.

ఇంటి నుంచి వెళ్లి..మరో ఇంట్లో శవమై..

పంజాగుట్ట పీఎస్ పరిధిలో మిస్సింగ్ కేసు నమోదు

హత్య కోణంలో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ఖైరతాబాద్, జనవరి 1 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ వ్యక్తి మరో ఇంట్లో శవమైన కనిపించాడు. పంజాగుట్ట, ఎస్ఆర్‌నగర్ పోలీసు స్టేషన్ల పరిధిలో జరిగిన ఈ ఘటన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఎల్లారెడ్డిగూడలోని బీఎస్ఎన్ఎల్ గల్లీలో నివాసముండే విష్ణు రూపాని (45) కిరాణ వ్యాపారస్తుడు. గత నెల 29న ఇంట్లో భార్యతో పని ఉందంటూ బయటకు వెళ్లాడు. 24గంటలు గడిచినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు. దీంతో ఆయన సోదరుడు మహేశ్ రూపాని 30న పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు దర్యాప్తులో భాగంగా సీసీ కెమెరాల పుటేజీలతో పాటు సెల్‌ఫోన్ సిగ్నల్‌ను ట్రేస్ చేశారు. దాని ఆధారంగా ఎస్ఆర్‌నగర్ పీఎస్ పరిధిలోని బుద్ధ నగర్‌లో ఓ గదిలో ఉన్నట్లు గుర్తించారు. అప్పటికే దుర్వాస వస్తుండడంతో బయట నుంచి వేసిన తాళాన్ని పగులగొట్టి లోపలికి వెళ్లి చూడగా, కుళ్లిపోయిన స్థితిలో మృత దేహం కనిపించింది.

అనుమానాలెన్నో....

గత నెల 29న ఇంటి నుంచి బయలుదేరిన విష్ణు రూపాని ఓ గుర్తుతెలియని వ్యక్తితో ద్విచక్రవాహనంపై ప్రయాణించినట్లు సీసీ పుటేజీల్లో పోలీసులు గుర్తించారు. ఆ వ్యక్తి వెంటే ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో పార్శిల్ తీసుకొని బయలుదేరినట్లు ఆ పుటేజీల్లో కనిపించింది. ఇదిలా ఉండగా, మృతుడి షాపుపై అంతస్తులో గతంలో కిరాయి ఉన్న వ్యక్తి తన కారును తనఖా పెట్టి లక్షలాది రూపాయలు తీసుకున్నట్లు సమాచారం. సదరు వ్యక్తితో కలిసి ప్రస్తుతం మృతదేహం లభించిన గదిలో కలిసి మద్యం సేవించే వారని తెలిసింది. మూడు రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిన విష్ణు రూపాని అదే గదిలో కుళ్లిపోయిన స్థితిలో శవమై కనిపించాడు. అంతేకాకుండా గది సైతం బయట నుంచి తాళం వేసి ఉంది. సీసీ పుటేజీల్లో అతను ప్రయాణిస్తున్న వాహనం వెనుక సీటులో కూర్చున్న వ్యక్తి అతని వద్ద డబ్బులు తీసుకున్న వ్యక్తి ఒకరేనా..ఆ గదికి ఎందుకు వెళ్లారు.. ఆ గది యజమాని ఎవరూ.. దానిని వీరికి ఎందుకు ఇచ్చాడు.. అనే కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దర్యాప్తులో ఆలస్యం....?

కనిపించకుండా పోయిన విష్ణు రూపాని ఆచూకీ కనిపెట్టాలని కోరుతూ ఆయన సోదరుడు డిసెంబర్ 30న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే కేసు దర్యాప్తు ప్రారంభించి అతన్ని ఆచూకీ తెలుసుకోవాల్సి ఉండగా, పోలీసులు కొంత ఆలస్యం చేసినట్లు తెలుస్తోంది. మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో కనిపించగా, ఫిర్యాదు చేసిన వెంటనే కనిపెట్టి ఉంటే ఇంతా జరిగేది కాదని స్థానికులు చెబుతున్నారు.

రోజుకు రెండు గంటలు రిసెప్షన్‌లో ఉండండి

సరి'కొత్త' షరతుతో బెయిల్

డ్రంక్ అండ్ డ్రైవ్ యాక్సిడెంట్ నిందితులకు కోర్టు షాక్

బంజారాహిల్స్: మద్యం మత్తులో కారు నడుపుతూ యాక్సిడెంట్ చేయడంతో పాటు బ్రీత్ అనలైజర్ పరీక్షలకు సహకరించకుండా మూడు గంటల పాటు న్యూసెన్స్‌కు పాల్పడిన ఓ యువజంటకు కోర్టు సరికొత్త షరతుతో బెయిల్ మంజూరు చేసింది. వివరాల్లోకి వెళ్తే.. వెస్ట్ మారెడ్‌పల్లికి చెందిన తీగుళ్ల దయాసాయి రాజ్(28) అనే వ్యాపారి తన స్నేహితురాలి(25)తో కలిసి శనివారం రాత్రి జూబ్లీహిల్స్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో పార్టీకి వెళ్లాడు. పార్టీలో పీకలదాకా మద్యం సేవించిన దయాసాయిరాజ్ కారు నడిపించుకుంటూ జూబ్లీహిల్స్ రోడ్ నం. 1లోని నందమూరి బాలకృష్ణ ఇంటి సమీపంలో అతివేగంగా డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో కారు గాల్లోకి ఎగిరి రోడ్డుకు రెండోవైపు పడిపోయింది. అదృష్టవశాత్తూ ప్రమాదం జరిగిన సమయంలో వాహనాలు లేకపోవడంతో పెనుముప్పు తప్పింది. అయితే ప్రమాదం తర్వాత జూబ్లీహిల్స్ పోలీసులు అక్కడకు చేరుకుని బ్రీత్ అనలైజర్ పరీక్షల కోసం ప్రయత్నించగా వీరంగం సృష్టించారు. తాము మద్యం సేవించలేదని, తమకు ఎందుకు పరీక్షలు చేస్తారంటూ సుమారు 3గంటల పాటు చుక్కలు చూపించారు. తమ మీద కేసు ఎలా పెడ్తారు.. ? మా కారు ఎవరినీ ఢీకొట్టలేదు కదా.. అంటూ వితండ వాదం చేశారు. ఎట్టకేలకు మూడు గంటల తర్వాత వారిద్దరికీ బ్రీత్ అనలైజర్ పరీక్షలు చేయగా మోతాదుకు మించి మద్యం సేవించినట్లు తేలింది. ర్యాష్ డ్రైవింగ్‌తో పాటు డ్రంక్ అండ్ డ్రైవ్ చేసినందుకు వారిపై కేసు నమోదు చేసిన పోలీసులు రెండ్రోజుల కిందట కోర్టులో హాజరుపర్చారు. పోలీసులపట్ల దురుసుగా ప్రవర్తించడంతో పాటు మద్యం మత్తులో భారీ యాక్సిడెంట్ చేయడమే కాకుండా న్యూసెన్స్‌కు పాల్పడడంతో రిమాండ్ విధించాలని పోలీసులు కోరారు. కాగా నిందితులకు బెయిల్ మంజూరు చేసిన న్యాయస్థానం.. వినూత్నమైన షరతును విధించింది. 15 రోజుల పాటు రోజూ జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి సంతకం చేయడంతో పాటు ఉదయం 10నుంచి 12 గంటల వరకు అక్కడున్న రిసెప్షన్ వద్ద ఉండి పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదు దారులకు స్వాగతం పలకాలనే షరతు కింద బెయిల్ మంజూరు చేశారు. దీంతో రెండ్రోజులుగా దయాసాయిరాజ్‌తో పాటు అతడి స్నేహితురాలు పీఎస్‌కు వస్తున్నారు.

తాగారు.. దొరికారు..

- న్యూ ఇయర్ వేడుకల వేళ ..డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు
- మూడు కమిషనరేట్ల పరిధిలో చిక్కిన మందుబాబులు
- పంజాగుట్ట పీఎస్ పరిధిలో ఒకరికి 550 పాయింట్లు

సిటీబ్యూరో, జనవరి 1(నమస్తే తెలంగాణ) :

చెదురు మదురు ఘటనలు మినహా ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో కొత్త సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా జరిగాయి. మద్యం దుకాణాలు, బార్ల వద్ద అర్ధరాత్రి వరకు రద్దీ కనిపించింది. విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తామంటూ ట్రై పోలీస్ కమిషనర్లు ముందస్తుగానే ప్రజలకు సూచనలు చేస్తూ వచ్చారు. దీనికి తోడు బార్లు, పబ్బులు, ఈవెంట్ నిర్వాహకులు క్యాబ్‌లు, ఆటోలతో పాటు డ్రైవర్లను కూడా అందుబాటులో ఉంచారు. మరో సంస్థ కార్లు, ద్విచక్రవాహనాలను ఉచితంగా పంపిణీ చేస్తామంటూ ముందుకొచ్చింది. ఇలా మద్యం జోరుగా విక్రయాలు సాగినా ఎవరి జాగ్రత్తలు వారు తీసుకోవడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది డ్రంక్ డ్రైవ్ కేసులు 359 తగ్గాయి. నగరంలో మద్యం దుకాణాలు, బార్ల వద్ద అర్ధరాత్రి వరకు భారీగా రద్దీ కనిపించింది. యువకులు రోడ్లపై అర్ధరాత్రి వాహనాలపై తిరుగుతూ కేరింతలు కొట్టారు. పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్‌లు అడుగడుగునా ఏర్పాటు చేశారు. అబిడ్స్‌లో డ్రంక్ అండ్ డ్రైవ్ ఏర్పాటు చేస్తే అదే రూట్‌లో కోఠి బ్యాంక్ స్ట్రీట్‌లో మరో చోట ఇలా ఒకే రూట్‌లో పలు చోట్ల డ్రంక్ అండ్ డ్రైవ్‌లు నిర్వహించారు. అర్ధరాత్రి తరువాత ఉదయం 2 గంటల వరకు ఈ డ్రైవ్‌లో చాలా చోట్ల కొనసాగాయి. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకే రూట్‌లో పలు చోట్ల పెట్టడంతో అర్ధరాత్రి ట్రాఫిక్ రద్దీ ఏర్పడి, సాధారణ వాహనదారులు పోలీసులే ట్రాఫిక్ జామ్ చేయడం ఏంటీ అంటూ మండిపడ్డారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఫ్లైఓవర్లు మూసేశారు. ట్రాఫిక్, లా అండ్ అర్డర్ పోలీసులు అర్ధరాత్రి బందోబస్తులు నిర్వహించారు. అర్ధరాత్రి 12 గంటల తరువాతే యువకులు రోడ్లపైకి వచ్చి స్నేహితులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు ఖాళీ రోడ్లపై కార్లు, బైక్‌లపై వేగంగా వెళ్తూ ప్రమాదాలు చోటు చేసుకుంటాయి. ఈ నేపథ్యంలోనే 12 గంటల తరువాత పోలీసులు రోడ్లపై ఉంటూ అతి వేగాన్ని కట్టడి చేస్తూ విస్తృతంగా డీడీ చేయడంతో గత ఏడాది కంటే ఈ ఏడాది కేసులు తక్కువ నమోదయ్యాయని పోలీసులు చర్చించుకుంటున్నారు. కాగా, పంజాగుట్ట పోలీసు స్టేషన్ పరిధిలో మొత్తం 49 మందిపై కేసులు నమోదు చేశారు. వెంగల్‌రావుపార్కు వద్ద జరిగిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో ఓ వ్యక్తికి ఏకంగా రికార్డు స్థాయిలో 550 పాయింట్లు వచ్చాయి.

ఎల్బీనగర్‌లో సిబ్బందికి సూచనలిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

ట్రై కమిషనరేట్లలో నమోదైన డ్రంక్ అండ్ డ్రైవ్(డీడీ) కేసులు

కమిషనరేట్	డీడీ కేసుల సంఖ్య
హైదరాబాద్	1184
సైబరాబాద్	839
రాచకొండ	619



ఉలవచారులో తనిఖీలు

సిటీబ్యూరో: హోటళ్లలో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారులు చేస్తున్న తనిఖీల్లో విస్తుపోయే విషయాలు తెలిసొస్తున్నాయి. తాజాగా కొంపల్లిలో ఉలవచారు హోటల్‌లో ఫుడ్ లైసెన్స్ ప్రదర్శనలో లేకపోవడం, కుళ్లిపోయిన టమాటాలు, సింథటిక్ ఫుడ్ కలర్స్ వినియోగిస్తున్నట్లు ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారుల తనిఖీల్లో తేలింది. వంటగది అపరిశుభ్రంగా ఉందని, ఫ్రిజ్‌లో చికెన్, మటన్ పచ్చి మాంసాన్ని కలిపి ఉంచినట్లు గుర్తించారు. కొంపల్లిలో ట్రైన్ థీమ్ రెస్టారెంట్‌లో అపరిశుభ్రంగా వంటగది ఉందని, వెజ్ అండ్ నాన్ వెజ్ కలిపి ఫ్రిజ్‌లో పెట్టారని తేల్చారు. మల్నాడ్ కిచెన్ స్టోరేజీలో పలు చోట్ల ఎలుకల మలమూత్రాలను ఉన్నట్లు గుర్తించారు. వంటగది, ఫ్లోరింగ్‌లు అస్సలు శుభ్రంగా లేవని, సింథటిక్ కలర్స్ వినియోగిస్తున్నారని, గోడలు జిడ్డుగా ఉన్నాయని, టైల్స్ విరిగిపోయాయని అధికారులు తెలిపారు. సంబంధిత నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఫుడ్ సేఫ్టీ విభాగం అధికారులు జరిమానాలు విధించారు.